సాక్షి రాజన్న సిరిసిల్ల

గురువారం । 10 । ఆగస్టు । 2023



సదరం శిబిరం

సిరిసిల్లటౌన్: ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం సదరం శిబిరం నిర్వహించారు. మానసిక 14, వినికిడి సమస్య 23 మంది దివ్యాంగులకు వైద్యులు నిర్ధారణ పరీక్షలు చేశారు.



భరణి నక్షత్ర వేడుకలు

ధర్మపురి: శ్రీయమధర్మరాజు ఆలయంలో బుధవారం భరణి నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేదపండితుడు పూజలు నిర్వహించారు.

గరిష్టం/కనిష్టం
32.0/25.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

15లోగా వ్యవసాయ గణన పూర్తిచేయాలి



మాట్లాడుతున్న సీపీవో శ్రీనివాసచారి

సిరిసిల్ల: జిల్లాలో గురువారం నుంచి చేపట్టనున్న వ్యవసాయ గణనను 15వ తేదీలోగా పూర్తి చేయాలని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పీబీ శ్రీనివాస చారి అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం వ్యవసాయ, వ్యవసాయ విస్తరణ అధికారులకు వ్యవసాయ గణనపై శిక్షణ ఇచ్చారు. మండల వ్యవసాయాధికారులు వ్యవసాయ గణన ఇన్‌చార్జి ఆఫీసర్లుగా ఉంటారని, వ్యవసాయ విస్తరణ అధికారులు ఎన్యుమరేటర్లుగా వ్యవహరిస్తారని వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్, శిక్షణ అధికారులు అసిస్టెంట్ డైరెక్టర్ ఎంఆర్‌వీ రమణ, డిప్యూటీ గణాంకాల అధికారి పి.హరికృష్ణ, ఎంపీఎస్‌వోలు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

300 కుటుంబాలకు రూ.3 కోట్లు బీసీ బంధు



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

వేములవాడ: నియోజకవర్గంలోని 300 కుటుంబాలకు రూ.3 కోట్ల బీసీ బంధు అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే రమేశ్‌బాబు తెలిపారు. బీసీ బంధు పథకంలో ఎంపికైన వేములవాడ పట్టణానికి చెందిన 26 కుటుంబాలకు బుధవారం రూ.లక్ష చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. రాష్ట్రంలోని 14 బీసీ కులాలకు బీసీ బంధు వర్తింపు చేస్తున్నట్లు తెలిపారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణాలో అన్ని పండుగలు సంతోషాల మధ్య జరుపుకున్నట్లుగానే అన్ని వర్గాల ప్రజలు ఆర్థిక స్వావలంబన సాధించాలన్నదే సీఎం తపన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కమిషనర్ అన్వేష్, కౌన్సిలర్లు గూడూరి లక్ష్మి, నరాల శేఖర్, నాయకులు పుల్కం రాజు, గూడూరి మధు పాల్గొన్నారు.

గృహలక్ష్మి పథకంతో రిజిస్ట్రేషన్లకు గిరాకీ



రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పెరిగిన రద్దీ

వేములవాడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గృహలక్ష్మి పథకంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రద్దీ నెలకొంది. మహిళలకు 75 గజాల భూమి రిజిస్ట్రేషన్ అయింటే దరఖాస్తు చేసుకోవాలని, అధికార యంత్రాంగం పరిశీలించి వారికి ఈ పథకంలో డబ్బులు చెల్లిస్తుందని ప్రకటించడంతో వేములవాడ ప్రాంతంలోని చాలా మంది మహిళలు తమ పేర రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు బుధవారం రిజిస్ట్రేషన్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ పథకంలో ఎవరు ఎంపికవుతారో కానీ దరఖాస్తు కోసం మాత్రం తమ పేర రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు జనం ఎగబడుతున్నారు. ప్రభుత్వానికి ఇదో రకమైన ఆదాయం చేకూరుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సిరిసిల్ల సర్కిల్‌లో 106 మద్యం దరఖాస్తులు

సిరిసిల్లక్రైం: జిల్లాలోని మద్యం దుకాణాలకు అబ్కారీ శాఖ స్వీకరిస్తున్న టెండర్లు సిరిసిల్ల సర్కిల్‌లోని సిరిసిల్ల వైన్స్‌కు అధిక దరఖాస్తులు దాఖలైనట్లు ఎక్సైజ్ శాఖ అధికారి గణాంకాలు చెబుతున్నాయి. ఐదు రోజులుగా జరుగుతున్న దరఖాస్తుల స్వీకరణలో సిరిసిల్ల సర్కిల్‌లో 106 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి పంచాక్షరి తెలిపారు. ఎల్లారెడ్డిపేట సర్కిల్‌లో 37, వేములవాడ సర్కిల్‌లో 27 దరఖాస్తులు వచ్చాయి. 48 మద్యం దుకాణాలకు 170 దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు. ఈనెల 18వ తేదీ వరకు దరఖాస్తులు చేయడానికి అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

కోనరావుపేట: ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీల సమస్య పరిష్కరించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాసరావు అన్నారు. బుధవారం కోనరావుపేట మండలంలోని పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. ప్రమోషన్లు, బదిలీలకు సంబంధించిన కోర్టు కేసు త్వరగా తేలేలా ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు. పీఆర్సీ ఏర్పాటు, మధ్యంతర భృతి విషయంలో సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటన చేయడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఐరెడ్డి సాంబరెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంగళ మహేశ్, జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.



జాకీ మిషన్ కుడుతున్న ఈమె పేరు జిందం పల్లవి. డిగ్రీ చేసిన ఈమె రేవతి ఇంట్లోనే జాకెట్లు కుట్టేది. పక్షం రోజులుగా జాతీయ జెండాలు కుడుతోంది. భర్త కమలాకర్ సహకారంతో రోజుకు 3,000 జెండాలు కుడుతూ రూ.3వేలు సంపాదిస్తున్నారు. ఇలా సిరిసిల్లలో జాతీయ జెండాల పనితో మెరుగైన కూలిని పొందుతూ ఊరంతా ఉపాధి పొందుతున్నారు.



జెండా బట్టను కట్ చేస్తున్న ఈమె పేరు కోట అనిత. తంగళ్లపల్లి మండలం కేసీఆర్ నగర్‌లో ఉంటుంది. భర్త సతీశ్ పవర్‌లూమ్ కార్మికుడు. పది రోజులుగా నిత్యం 8 గంటల పాటు జాతీయ జెండాలను కట్ చేసే పనిలో ఉన్నారు. నిత్యం భోజనం, టిఫిన్ పెట్టి రూ.500 కూలి ఇస్తున్నారు. ఇలా ఒక్కరు.. ఇద్దరు కాదు.. అనిత లాగే సిరిసిల్లలో ఓ వెయ్యి మంది మహిళలు ఉపాధి పొందుతున్నారు.



జెండా బట్ట పట్టుకుని వెళ్తున్న ఈమె పేరు ఇంజపురి రేవతి. సిరిసిల్ల నెహ్రూనగర్‌కు చెందిన ఈమె గతంలో బీడీలు చేసేది. నెల రోజులు కష్టపడినా రూ.2 నుంచి రూ.3వేలు వచ్చేవి. ఇప్పుడు ఇంట్లో మిషన్‌పై జెండాలు కుట్టే పని చేస్తుంది. ఒక్క జెండా కుడితే ఒక్క రూపాయి ఇస్తున్నారు. నిత్యం వెయ్యి జెండాలు కుడుతూ రూ.వెయ్యి సంపాదిస్తోంది.

దేశం నిండా.. సిరిసిల్ల జెండా!

- 'హర్ ఘర్ తిరంగా'కు ఇక్కడి వస్త్రమే
- దేశ వ్యాప్తంగా ఎగుమతి
- కోటి జెండాలు తయారీ
- ఊరు నిండా మెరుగైన ఉపాధి



జెండాలు కటింగ్ చేస్తున్న స్థానికులు

సిరిసిల్ల: దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు అవుతున్న సందర్భంగా దేశభక్తిని ద్విగుణీకృతం చేసేలా.. మహనీయుల త్యాగాలు.. పోరాట ఫలాలు నేటి తరానికి తెలిసేలా ప్రతీ ఇంటిపైనా జాతీయ జెండాలు ఎగుర వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆగస్టు 15వ తేదీ నాటికి ఇంటింటికీ జెండాలను అందించేందుకు సిరిసిల్లలో జాతీయ జెండాల తయారీ ఆర్డర్లు వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా 1.20 కోట్ల జాతీయ జెండాలు అవసరం ఉండగా.. పాలిస్టర్ వస్త్రాన్ని టెస్కో ద్వారా కొనుగోలు చేసి, ఆ బట్టను ప్రాసెసింగ్ చేసి, మూడు రంగుల జెండాలను తయారు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు సిరిసిల్ల నేతన్నల వద్ద ఇప్పటికే 55 లక్షల మీటర్ల వస్త్రాన్ని కొనుగోలు చేశారు. ఈ వస్త్రానికి ఒక్కో మీటరుకు రూ.12 చెల్లిస్తున్నారు. అంటే రూ.6.60 కోట్ల ఆర్డర్లు సిరిసిల్ల నేతన్నలకు లభించాయి. స్వాతంత్య్ర సంబురాలు సిరిసిల్ల నేతన్నలకు కలిసి వచ్చాయి.

రాష్ట్ర వ్యాప్తంగా ఆర్డర్లు

రాష్ట్ర వ్యాప్తంగా 38,588 పవర్స్ ఉండగా.. ఇందులో ఒక్క సిరిసిల్లలోనే 28,494 పవర్ లూమ్స్ ఉన్నాయి. రెండో స్థానంలో 4,116 సాంచాలతో ఉమ్మడి నల్గొండ జిల్లా రెండో స్థానంలో ఉంది. అతి తక్కువ సాంచాలు 18తో సంగారెడ్డి జిల్లా చివరిలో ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా సిరిసిల్ల, పోచంపల్లి, గద్వాల, నారాయణపేట, వరంగల్, భువనగిరి ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న పాలిస్టర్ వస్త్రాన్ని కొనుగోలు చేశారు. ఒక్క సిరిసిల్లలోనే 55 లక్షల మీటర్లు కొనుగోలు చేశారు. ఇప్పటికే సిరిసిల్లలో బతుకమ్మ చీరలు ఉత్పత్తి అవుతుండగా.. మరోవైపు పాలిస్టర్ వస్త్రాన్ని కొనుగోలుకు ఆర్డర్లు రావడం విశేషం.

సిద్ధమవుతున్న జెండాలు

సిరిసిల్లలో జాతీయ జెండాలు సిద్ధమవుతున్నాయి. దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి సిరిసిల్లలోనే పది మంది వ్యాపారులకు కోటి జెండాల తయారీ ఆర్డర్లు వచ్చాయి. దీంతో జెండాలు తయారు చేసే వ్యాపారులు బిజీ బిజీగా ఉన్నారు. వీటి ద్వారా నేరుగా 1,200 మంది మహిళలు ఉపాధి పొందుతున్నారు.

నాలుగు రాష్ట్రాలకు సరఫరా



తెలంగాణతో పాటు, ఢిల్లీ, గుజరాత్, బీహార్ రాష్ట్రాల ఆర్డర్లు వచ్చాయి. నేను 25 లక్షల మేరకు జెండాలను సరఫరా చేస్తున్న. వాస్తవానికి సమయం లేదు. ఇంకా ఏపీ నుంచి కూడా ఆర్డర్లు వస్తున్నాయి. వందలాది మంది మహిళలకు జెండాలు కుట్టే పని ఇస్తున్న.
– ద్యావనపల్లి మురళి, జెండాల వ్యాపారి

ముందుగా 53 లక్షలే అనుకున్నాం



ముందుగా 53 లక్షల మీటర్లు కొనుగోలు చేయాలని అనుకున్నాం. అధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. కానీ జెండాల వేస్టేజీ, రంగులు చెదిరిపోవడం, ప్రింటింగ్ సమస్యలతో మరో రెండు లక్షల మీటర్లు అదనంగా కొన్నాం. 55 లక్షల మీటర్ల పాలిస్టర్ వస్త్రాన్ని కొనుగోలు చేశాం.
– సాగర్, జౌళిశాఖ ఏడీ, సిరిసిల్ల

స్కిల్ డెవలప్‌మెంట్‌పై దృష్టి సారించాలి

- ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్
- ఎల్లారెడ్డిపేటలో డిగ్రీ అడ్మిషన్ల పోస్టర్ ఆవిష్కరణ



డిగ్రీ ప్రవేశాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న వినోద్‌కుమార్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): విద్యారంగంలో అమెరికా తరహాలో కొలంబియా కోర్సు ప్రవేశపెట్టే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని, విద్యార్థులు నైపుణ్యత, స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఎక్కువ దృష్టి సారించాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డిపేట నూతన డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల పోస్టర్‌ను ఆవిష్కరించారు. 2023–24 విద్యా సంవత్సరానికి డిగ్రీలో ప్రవేశానికి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీఏ, బీఎస్సీ, బీజెడ్సీ, సీఏ కోర్సుల్లో ఒక్కో గ్రూపులో 60 విద్యార్థులను తీసుకుంటారని తెలిపారు. స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పించి స్కిల్ డెవలప్‌మెంట్ జరగాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. రానున్న రోజుల్లో విద్యారంగంలో ఇతర రాష్ట్రాలకు దిక్సూచిగా మారుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర నాయకులు చీటీ నర్సింగరావు, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, మాజీ ఎంపీపీ ఎలుసాని మోహన్‌కుమార్, నాయకులు అందె సుభాష్, బాల్‌రెడ్డి, ఎంపీటీసీలు అనసూయ, నాగరాణి, అప్సరా ఉన్నీసా ఎడ్ల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. కాగా మొదటి రోజు కళాశాలలో ముగ్గురు విద్యార్థులు ప్రవేశాలు పొందారు.

ప్రవీణ్ కుటుంబాన్ని ఆదుకుంటాం

వీర్నపల్లి (సిరిసిల్ల): మండలంలోని రంగంపేటకు చెందిన పీజీ వైద్య విద్యార్థి భూక్య ప్రవీణ్ కుటుంబాన్ని ఆదుకుంటామని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ అన్నారు. మూడు రోజుల క్రితం మృతి చెందిన ప్రవీణ్ కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు.

రేషన్ డీలర్ల సంబురాలు



సీఎం, మంత్రుల చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రేషన్ డీలర్లు

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలో రేషన్ డీలర్లు బుధవారం సంబురాలు నిర్వహించారు. రేషన్ డీలర్లకు ఇచ్చే కమీషన్‌ను ప్రభుత్వం పెంచుతూ నిర్ణయం తీసుకోవడంతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. అంబేడ్కర్ సర్కిల్ వద్ద సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, గంగుల కమలాకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డిమల్ల హన్మాండ్లు, ప్రధాన కార్యదర్శి వెగ్గలం సత్యనారాయణ, సిరిసిల్ల డివిజన్ ప్రధాన కార్యదర్శి గాజుల శ్రీనివాస్, వేములవాడ డివిజన్ అధ్యక్షుడు మహేశ్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఖ్యాతిని మరింత పెంచుతాం

- లోటుపాట్లు సరిదిద్దుతాం
- ప్రణాళిక ప్రకారం అభివృద్ధి చేస్తాం
- సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఆయాజ్



సిరిసిల్లటౌన్: దేశవ్యాప్తంగా విలసిల్లుతున్న సిరిసిల్ల మున్సిపల్ ఖ్యాతిని మరింత పెంచుతామని మున్సిపల్ కమిషనర్ ఎండీ ఆయాజ్ అన్నారు. ఫస్ట్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి పొంది సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎండీ అయాజ్ బుధవారం 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు. ఇక్కడ మున్సిపల్ కమిషనర్‌గా మంత్రి కేటీఆర్ తనకు ఇచ్చిన సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానని తెలిపారు. ఏళ్ల తరబడి ఉన్న కీర్తిని ఎట్టి పరిస్థితుల్లోనూ వెనుకబడనివ్వమని అన్నారు. పాలకవర్గం, అధికార యంత్రాంగం సహకారంతో ఉన్నతాధికారుల సూచనల మేరకు పనిచేసి పట్టణాన్ని మరింత అభివృద్ధి పరుస్తామని తెలిపారు.

ప్రశ్న: మీకుటుంబ నేపథ్యం.. విద్యాభ్యాసం

కమిషనర్: మాది మధ్య తరగతి కుటుంబం. నాన్న రాజ్‌మహ్మద్ రెవెన్యూ శాఖలో ఆర్‌ఐగా పనిచేసే వారు. అమ్మ అయేషాబేగం. ముగ్గురు అన్నదమ్ములను క్రమశిక్షణతో పెంచారు. విద్యాభ్యాసం డిగ్రీ వరకు ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే జరిగింది. ఎంఎస్సీ, ఎంఏ, ఎల్‌ఎల్‌బీ వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో పూర్తి చేశా.

ప్రశ్న: మొదటి నుంచి ఇప్పటివరకు మీ ప్రస్థానం

కమిషనర్: 2003లో మంచిర్యాల శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌గా మొదటి పోస్టింగ్. ఏడేళ్లు కోరుట్లలో ఫుడ్‌ఇన్‌స్పెక్టర్‌గా, 2012లో పెద్దపల్లి నగరపంచాయతీ కమిషనర్‌గా చేసి 2013 నుంచి మళ్లీ ఆదిలాబాద్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా 2017వరకు కొనసాగగా. అక్కడే రెండేళ్ల పాటు మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించా. 2019లో కోరుట్ల ద్వితీయశ్రేణి కమిషనర్‌గా పదోన్నతితో విధులు నిర్వర్తించి ఇటీవల సిరిసిల్లకు మొదటిశ్రేణి గ్రేడ్ కమిషనర్‌గా వచ్చిన.

ప్రశ్న: జీవితంలో మరిచిపోలేని సంఘటనలు

కమిషనర్: మొదటి నుంచి సర్కార్ విద్యను అభ్యసించిన. బంధువుల్లో మా అన్నదమ్ములం ఉన్నత చదువులు అభ్యసించాం. 2016లో ఎలాంటి అనారోగ్యం లేని అమ్మ హఠాత్తుగా చనిపోవడం తీవ్రంగా కలిచివేసింది. తర్వాత నాన్న కూడా కాలం చేశారు. నేను పుట్టి పెరిగిన ఆదిలాబాద్‌తో పాటు ఎక్కువ కాలం పనిచేసిన కోరుట్లలో ఉద్యోగ చేయడం సంతృప్తి నిచ్చింది. కోరుట్లలో పనిచేసిన పోటీతత్వం నాకు మరిచిపోలేని అనుభూతులు.

ప్రశ్న: సిరిసిల్లలో సవాళ్లను ఎలా ఎదుర్కొంటారు

కమిషనర్: దేశంలోనే సిరిసిల్లకు మంచి ఇమేజ్ ఉంది. ఆవన్నె ఎక్కడా తగ్గదు. అభివృద్ధి పనుల్లో వేగం పెంచి నిర్ణీత సమయంలో పూర్తి చేస్తాం. పారిశుధ్యంపై వచ్చినప్పటి నుంచే ప్రత్యేక దృష్టి సారించా. శానిటేషన్ సిబ్బందితో పాటు మరిన్ని విభాగాల్లో సిబ్బంది కొరతను తీర్చుకుని ముందుకు వెళ్తాం.

ప్రశ్న: సిబ్బంది పనితీరుపై ఉన్న విమర్శలు ఎలా సరిదిద్దుతారు

కమిషనర్: సిబ్బంది పనితీరును ప్రత్యేక పరిశీలన జరుపుతాం. ఆఫీసులో బయోమెట్రిక్ తప్పనిసరిగా ఉంటుంది. సిటిజన్ చార్టర్ ప్రకారం ఆఫీస్‌కు వచ్చే సందర్శకులకు పనులు నెరవేర్చుతాం. రాత్రుళ్లు శానిటేషన్ పనులను మెరుగు పరుచుతాం. రెవెన్యూ విభాగంలో సిబ్బందిని చైతన్య పరుస్తూ ఎప్పటిలాగే నూరుశాతం వసూళ్లు చేయడమే కాకుండా ఆదాయం పెంచేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్తాం.

ప్రశ్న: చేపట్టే అభివృద్ధి పనులు

కమిషనర్: కొత్తగా రూ.2కోట్లలో రగుడు, నర్సింగ్ కళాశాల చౌరస్తాలను అభివృద్ధి పర్చుతున్నాం. ఇప్పుడున్న స్మార్ట్ సర్కిల్స్ గాంధీ, అంబేడ్కర్, కొండా లక్ష్మణ్ సర్కిళ్ల అందాలను కాపాడుతాం. హరితహారంలో 2.80 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళిక రూపొందించాం. మున్సిపల్ ఆస్తులు పరాధీనం కాకుండా ఖచ్చితంగా వ్యవహరిస్తాం. కొత్తచెరువు సందర్శనకు వచ్చే వారి అవసరాలకు అనుగుణంగా వసతులు కల్పించి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొస్తాం.

చీకోడులో కేంద్ర బృందం పర్యటన



పాఠశాల పరిసరాలు పరిశీలిస్తున్న సభ్యులు

ముస్తాబాద్(సిరిసిల్ల): మంత్రి కేటీఆర్ దత్తత గ్రామమైన చీకోడులో బుధవారం కేంద్ర స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటించింది. స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల ఎంపిక కోసం షేక్ అయాజ్ ఆధ్వర్యంలోని పరిశీలన బృంద సభ్యులు గ్రామంలో వివిధ పనులను పరిశీలించారు. మరుగుదొడ్ల వినియోగం, ఇంకుడు గుంతల నిర్మాణాలు, పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు పరిశీలించి హరితహారంలో నాటిన మొక్కలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని, సీసీరోడ్లు, శ్మశాన వాటికను పరిశీలించారు. తడి, పొడి చెత్త సేకరణ, డంపింగ్ యార్డులకు తరలింపు, సేంద్రియ ఎరువుల తయారీ విధానాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకున్నారు. కేంద్ర బృందం వెంట ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సర్పంచ్ చర్లపల్లి రజిత, ఉపసర్పంచ్ నాగరాజు, ఎంపీటీసీ సవిత, ఎంపీడీవో రమాదేవి, ఏపీవో ఆనంద్, కార్యదర్శి బాలకిషన్, ఆంజనేయులు, సుధాకర్‌రెడ్డి తదితరులున్నారు.

కోనరావుపేట: మండలంలోని మరిమడ్ల, బావుసాయిపేట, ధర్మారం, సుద్దాల గ్రామాల్లో కేంద్ర బృందం సభ్యులు సందర్శించారు. గ్రామాల్లో తిరుగుతూ పారిశుధ్య పనులు పరిశీలించారు.

వస్తారు.. వెళ్తారు

- తనిఖీలకే పరిమితం
- రాజన్న ఆలయంలో విజిలెన్స్ దాడుల తీరుపై చర్చ
- చర్యలు లేకపోవడంపై అనుమానాలు

వేములవాడ: రాజన్న ఆలయంలో ఉద్యోగుల అవినీతి పెరిగిపోయిందని ఫిర్యాదుల మేరకు ఇటీవల విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆయా విభాగాల్లో జోరుగా డబ్బులు దండుకుంటున్నారన్న ఫిర్యాదులు అందగా ఉమ్మడి జిల్లా విజిలెన్స్ బృందం తమ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇద్దరు సీఐలు, తహసీల్దారు, ఏఈల నేతృత్వంలో గతనెల 25న ఆలయంలో సుమారు 5 గంటలపాటు క్షుణ్ణంగా రికార్డులు పరిశీలించారు. దీంతో ఉద్యోగుల్లో దడ మొదలైంది. ఏ విధమైన ప్రశ్నలు, విచారణ ఉంటుందోనని భయపడిపోయారు. తీరా చూస్తే రికార్డులు స్వాధీనం చేసుకోవడం, అధికారులతో చర్చించిన పిమ్మట వెళ్లిపోవడం పరిపాటిగా మారిందన్న చర్చ జోరందుకుంది. గతంలో పలుసార్లు విజిలెన్స్ అధికారుల తనిఖీలు నిర్వహించగా, కనీసం ఒక్క చర్య తీసుకోలేదని, అసలేం జరుగుతోంది.. ఎందుకు వస్తున్నారు.. వెళ్తున్నారు.. అంటూ ఉద్యోగులు, స్థానికులు, భక్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



మొబైల్‌లో రికార్డులు చిత్రీకరిస్తున్న సభ్యులు(ఫైల్)



ప్రసాదాల కౌంటర్లో తనిఖీలు (ఫైల్)

తనిఖీలు రొటీన్..

రాజన్న ఆలయంలో అవినీతి రాజ్యమేలుతుందని, ప్రసాదాల కౌంటర్‌లో లడ్డూలు అమ్ముకుంటున్నారని, కోడెల టికెట్లు రీసేల్ అవుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గోదాంలో సరుకులు సరిగా వాడటం లేదని, వసతి గదులు ఇచ్చే విషయంలో అక్రమాలు, కోడెలకు గడ్డి, అరటిపండ్లను అధిక ధరలకు అమ్ముతున్నారని, టెంకాయలు ధరలు పెంచి విక్రయించడం, అన్నదానం సరుకులు బయటికి తరలింపు, తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ఉద్యోగాలు చేస్తున్నారన్న ఫిర్యాదులపై విజిలెన్స్ బృందం ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం రొటీన్‌గా మారింది. కాగా చర్యలు లేవన్నదే ప్రశ్నగా మిగిలిపోతుందన్న చర్చ కొనసాగుతోంది.

రికార్డుల వరకే.. చర్యలు శూన్యం

రాజన్న ఆలయంలోని గోదాం, విచారణ కార్యాలయం, కోడెల టికెట్లు, ప్రసాదాల కౌంటర్ సేల్స్ రిజిష్టర్, ఉద్యోగుల రిజిష్టర్, ఖాళీ కుర్చీల ఫొటోలను విజిలెన్స్ బృందం సభ్యులు తమ మొబైల్‌లో భద్రపరచుకుంటున్నారు. వీటితోపాటు సరుకుల షాంపిళ్లు, పలు రికార్డులు తీసుకెళ్తున్నారు. కాగా చర్యలు లేకపోవడం ప్రశ్నగా మిగిలిపోతుందని ఉద్యోగులే గుసగుసలాడుతున్నారు.

తనిఖీలకు సహకరిస్తున్నాం

రాజన్న ఆలయంలో పలు విభాగాలపై అందిన ఫిర్యాదుల మేరకు విజిలెన్స్ బృందం గతనెల 25న ఉదయం నుంచి సాయంత్రం వరకు తనిఖీలు నిర్వహించింది. షాంపిళ్లు, ఫొటోలు తీసుకెళ్లారు. విచారణ కొనసాగుతుంది. తనిఖీలకు తాము సంపూర్ణంగా సహకరిస్తున్నాం. గతంలోనూ విజిలెన్స్ బృందాలు తనిఖీలు చేశాయి. అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది నిత్యం క్రమశిక్షణగా పని చేస్తూ భక్తులకు సేవలందించాలని కోరుతూనే ఉన్నాం. ఎక్కడైనా అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు రుజువైతే బాధ్యులపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం.
– కృష్ణప్రసాద్, ఆలయ ఈవో

క్లుప్తంగా

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ


విచారణ జరుపుతున్న డీఎస్పీ, సీఐ

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని వరదవెల్లి పంచాయతీ పరిధి రాజన్నపేటలో బుధవారం వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన ఈడుగు మల్లేశం తనను రాజన్నపేటకే చెందిన వేణు, అతని కుటుంబ సభ్యులు దారి విషయంలో కులం పేరుతో దూషించి, కొట్టారని ఫిర్యాదు చేశాడన్నారు. దీనిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని తెలిపారు. స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా గత పదేళ్లుగా తాను వాడుకుంటున్న దారిని ఇప్పుడు వాడుకోకుండా అడ్డుపడుతున్నారని మల్లేశం వాపోయాడు. డీఎస్పీ వెంట వేములవాడరూరల్ సీఐ కృష్ణకుమార్, ఎస్సై మామిడి మహేందర్, ఏఎస్సై బాబు ఉన్నారు.

లింగంపేటలో అమరులకు నివాళి


నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

చందుర్తి(వేములవాడ): దేశ సేవకై అసువులు బాసిన మహనీయులను స్మరించుకునేందుకే మేరా మాటీ.. మేరా దేశ్ కార్యక్రమాన్ని బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ తెలిపారు. చందుర్తి మండలం లింగంపేట శివారులోని పోలీసు అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో దేశం అన్ని రంగాల్లో దూసుకుపోతోందని అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని, ప్రతిఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నాడి జలపతిరెడ్డి, నాయకులు ఎర్రం మహేశ్, రేగుల మల్లికార్జున్, మార్త సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

త్యాగధనులను గుర్తు చేసుకోవాలి

వేములవాడ: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగాలు చేసిన వారిని గుర్తు చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాల్లో భాగంగా బుధవారం మేరీ మిట్టి.. మేరా దేశ్‌లో భాగంగా పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించారు. నాయకులు ఎర్రం మహేశ్, రేగుల సంతోష్‌బాబు, ముప్పిడి శ్రీనివాస్, అన్నారం శ్రీనివాస్, జక్కుల తిరుపతి, గడ్డమీది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంజన్న ఆదాయం రూ.1.15 కోట్లు

కొండగట్టు(చొప్పదండి): జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయ హుండీలను బుధవారం కరీంనగర్ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ సమక్షంలో లెక్కించారు. మొత్తం 75 రోజులకు రూ.1,15,53,532 ఆదాయం సమకూరింది. 27గ్రాముల మిశ్రమ బంగారం, 4.800 కేజీల వెండి, 70 విదేశీ కరెన్సీ నట్లు వచ్చి నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. ఆలయ ఈవో వెంకటేశ్, అధికారులు జమున, శ్రీ నివాస్, సునీల్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఏళ్లుగా అద్దె గదులే దిక్కు


ఇది రిజిస్ట్రేషన్ కార్యాలయం. 22 ఏళ్లు అద్దె గదిలో కొనసాగుతోంది. రెండేళ్ల క్రితం మండల పరిషత్ ఆవరణలోని ఫైర్ స్టేషన్ పక్కన పక్కా భవన నిర్మాణం కోసం 6 గుంటల స్థలం కేటాయించి, రూ.60 లక్షలు మంజూరు చేశారు. కానీ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ఆ నిధులు వెనక్కి వెళ్లాయి. దీంతో భూముల రిజిస్ట్రేషన్‌కు వచ్చేవారు సందుల్లో తిరుగుతూ ఈ కార్యాలయాన్ని వెతికే దుస్థితి నెలకొంది.


ఇది డీఎస్పీ కార్యాలయం. బైపాస్ రోడ్డులోని ఓ అద్దె భవనంలో కొనసాగుతోంది. డివిజన్ పోలీసు అధికారిని కలిసి, తమ బాధలు చెప్పుకోవాలనుకునేవారు ఆఫీస్‌కు రావాలంటే నానాతంటాలు పడుతున్నారు.


ఈ చిత్రంలో కనిపిస్తున్నది వేములవాడ ఆర్డీవో కార్యాలయం. 9/11/2021న స్థానిక పీహెచ్‌సీలోని ఓ భవనంలో ప్రారంభించారు. ఇది అన్ని గ్రామాల ప్రజలకు దూరంగా ఉంది. ఈ కార్యాలయానికి వెళ్లాలంటే ఆటోలో వెతుక్కుంటూ వెళ్లాలి.

- ఒక్కచోట లేని ప్రభుత్వ కార్యాలయాలు
- ఆటోల్లో తిరుగుతూ వెతుక్కుంటున్న ప్రజలు
- ఎంపీడీవో ఆఫీస్ వద్ద స్థలం ఉన్నా భవనాలు నిర్మించట్లే
- వేములవాడలో పరిస్థితి

వేములవాడ: 2009లో సిరిసిల్ల నియోజకవర్గం నుంచి విడిపోయి వేములవాడ నియోజకవర్గంగా ఆవిర్భవించింది. 2020లో రెవెన్యూ డివిజన్‌గా ఏర్పడినా పలు ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించలేదు. ఏళ్లుగా అద్దె గదుల్లోనే కొనసాగుతున్నాయి. అవి కూడా ఒక్కచోట లేవు. దీంతో తమ అవసరాల కోసం వచ్చే ప్రజలు ఆయా కార్యాలయాల కోసం ఆటోలు మాట్లాడుకొని, వెతుకుతూ నానాతంటాలు పడుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా ఈ పరిస్థితి మారడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయం ఉన్న ప్రభుత్వ స్థలం దాదాపు ఆరున్నర ఎకరాలు ఉంది. ఇందులో కొన్ని ఆఫీస్‌లను ఇష్టారీతిని నిర్మించారు. ఈ భూమిలో మినీ కలెక్టరేట్‌గా భవనాలు నిర్మించి, అన్ని కార్యాలయాలను ఒక్కచోట చేరిస్తే బాగుంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఆ దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భవనాలు నిర్మించాలి


అన్ని గవర్నమెంట్ ఆఫీస్‌లు ఒక్కచోట ఉండాలి. అప్పుడే ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. ఒక ప్రణాళిక ప్రకారం నూతన భవనాల నిర్మాణం చేపట్టాలి. ఇందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలి.

– సోమినేని బాలు, నూకలమర్రి, వేములవాడ రూరల్ మండలం

వినతిపత్రాలు ఇచ్చాం


మా సొసైటీ సపరివార్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలని కలెక్టర్, ఎమ్మెల్యే, ఎంపీలకు వినతిపత్రాలు ఇచ్చాం. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని స్థలం బాగుంటుందని చెప్పాం.

– బింగి శ్రీనివాస్, వేములవాడ

ఒక్కచోట ఉంటే మెరుగైన సేవలు


నేను ఇటీవలే ఆర్డీవోగా బాధ్యతలు తీసుకున్నాను. ప్రభుత్వ కార్యాలయాలు ఒక్కచోట ఉంటే ప్రజలకు సేవలందుతాయి. నా ఆఫీస్‌లో పూర్తిస్థాయి సిబ్బంది లేరు. వీఆర్ఏల బదలాయింపులో నియమించే అవకాశాలున్నట్లు తెలిసింది.

– మధుసూదన్, ఆర్డీవో, వేములవాడ

కంప్యూటర్స్ చదివి.. సైబర్ నేరాలు

- రాజస్తాన్‌కు చెందిన యువకుడు, బాలుడిని పట్టుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ నాగేంద్రచారి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేంద్రచారి

వేములవాడ: తమకున్న కంప్యూటర్ పరిజ్ఞానంతో అమాయకులను బురిడీ కొట్టిస్తూ సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఇద్దరు రాజస్తాన్ వాసులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. వేములవాడలోని తన కార్యాలయంలో బుధవారం వివరాలు వెల్లడించారు. రాజస్తాన్‌లోని రామిడి పట్టణం సావాయి జిల్లాకు చెందిన రాంరేశ్ కుమార్, ఓ బాలుడు విలాసవంతమైన జీవితానికి అలవాటుపడ్డారు. రాంరేశ్‌కుమార్ బీఏ కంప్యూటర్స్ వరకు చదువుకున్నాడు. తనకున్న పరిజ్ఞానంతో అమాయక ప్రజలను మోసం చేసి, డబ్బులు సంపాదించడం నేర్చుకున్నాడు. దీన్ని పలువురికి నేర్పించి, వారు అక్రమంగా సంపాదించిన డబ్బుల్లో వాటా తీసుకునేవాడు. మరోవైపు బాలుడు కూడా మన రాష్ట్రంలో ఇన్‌స్టాగామ్, టెలిగ్రామ్ ద్వారా బిట్ కాయిన్‌లో డబ్బులు పెడితే అవి రెట్టింపు అవుతాయని చాలా మందికి మెస్సేజ్‌లు, కాల్స్ చేశాడు. ఈ క్రమంలో వేములవాడ పట్టణంలోని బాలానగర్‌కు చెందిన మిత్రా సచిన్‌కు గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఇలాంటి మెస్సేజ్, ఫోన్ కాల్ వచ్చాయి. నమ్మిన మిత్రా రూ.లక్ష భారత్ పే ద్వారా పంపించాడు. డబ్బులు రెట్టింపు కాదు కదా అసలు కూడా రాకపోయేసరికి వేములవాడ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జిల్లా సైబర్ టీం ఆర్ ఎస్సై జునైద్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి, రాజస్తాన్‌కు చెందిన ఇద్దరిని గుర్తించింది. రాంరేశ్ కుమార్‌ను అరెస్టు చేయగా, మరో వ్యక్తి మైనర్ కావడంతో రాజస్తాన్ కోర్టులోనే హాజరుపర్చినట్లు డీఎస్పీ తెలిపారు. వారి వద్ద నుంచి 7 సెల్‌ఫోన్లు, 2 సిమ్ కార్డులు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ టీం ఆర్ఎస్సై, సిబ్బందిని ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు. కార్యక్రమంలో టౌన్ సీఐ కరుణాకర్, ఎస్సై రమేశ్, కానిస్టేబుల్ గోపాల్ పాల్గొన్నారు.

రుద్రంగిలో రోడ్డు మరమ్మతు ప్రారంభం



సాక్షి ఎఫెక్ట్..

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి మండల కేంద్రంలో రోడ్డు పూర్తిగా ధ్వంసమై, స్థానిక ప్రజలతోపాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయమై 'సాక్షి' దినపత్రికలో కథనాలు వచ్చాయి. గత నెల 20న 'అడుగుకో గుంత' శీర్షికన రోడ్డు దుస్థితిని కళ్లకు కట్టేలా వార్తను ప్రచురించింది. దీనికి ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించారు. మంగళవారం నుంచి రోడ్డు మరమ్మతు ప్రారంభించారు. వరుసగా వార్తలు రాయడం వల్లే రోడ్డు పనులు ప్రారంభమయ్యాయని స్థానికులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా 'సాక్షి'దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

సెల్‌ఫోన్ దొంగకు ఎనిమిది నెలల జైలు

సిరిసిల్లక్రైం: సెల్‌ఫోన్ దొంగతనం చేసిన నిందితుడికి ఎనిమిది నెలల జైలు శిక్ష విధిస్తూ సిరిసిల్ల న్యాయమూర్తి హిమబిందు గురువారం తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. జనవరి 25న సిరిసిల్లలోని తారకరామ ఆస్పత్రిలో సెల్‌ఫోన్ దొంగతనం జరిగిందని ఆడెపు శ్రీదర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై ఎస్సై శ్రీకాంత్ కేసు నమోదు చేసుకొని విచారణ జరిపారు. నిజామాబాద్ జిల్లా రుద్రూరుకు చెందిన గైని శ్రీనివాస్ దొంగతనం చేసినట్లు గుర్తించి కోర్టు అనుమతితో రిమాండ్‌కు పంపారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన ప్రథమశ్రేణి న్యాయమూర్తి హిమబిందు నిందితుడికి జైలు శిక్ష విధించారు.

సీఈఐఆర్ అప్లికేషన్‌తో ఫోన్లు రికవరీ

- 146 మొబైల్ ఫోన్లు గుర్తించాం
- ఎస్పీ అఖిల్ మహాజన్


బాధితుడు సురేశ్‌కు ఫోన్ అప్పగిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: జిల్లాలో సీఈఐఆర్ అప్లికేషన్‌తో ఇప్పటివరకు 123 సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. బుధవారం జిల్లా పోలీసు అధికారులతో కలిసి తన కార్యాలయంలో దాదాపు 10 మందికి ఫోన్లు అప్పగించారు. సీఈఐఆర్ అప్లికేషన్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు ఎస్పీ సూచించారు. ఫోన్ పోయినా, చోరీకి గురైనా www.ceir.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. జిల్లాలో 567 ఫిర్యాదులు రాగా 146 మొబైల్ ఫోన్లు గుర్తించి, వాటిలో 123 (84శాతం) రికవరీ చేశామని పేర్కొన్నారు. పోర్టల్‌లో ఐఎంఈఐ నంబర్, పూర్తి వివరాలను నమోదు చేయాలని, అప్పుడే దర్యాప్తు సులభతరం అవుతుందన్నారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

సిరిసిల్లఅర్బన్: అనుమతి లేకుండా బుధవారం వెంటాపూర్ శివారు నుంచి ఎర్రమట్టి తరలిస్తున్న టిప్పర్‌ను పెద్దూరు శివారులో పట్టుకున్నట్లు మైనింగ్ అధికారి సైదులు తెలిపారు. మట్టి అక్రమంగా తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రెవెన్యూ శాఖకు వీఆర్ఏల బైబై


రెవెన్యూ అధికారికి హామీ పత్రం ఇస్తున్న వీఆర్ఏలు

వేములవాడరూరల్: ఏళ్లుగా రెవెన్యూ శాఖలో విధులు నిర్వహిస్తూ తమకున్న అనుబంధాన్ని తెంచుకున్నారు వీఆర్ఏలు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు వీఆర్‌వోలను ఇప్పటికే పలు శాఖలకు బదిలీ చేశారు. అర్హతలను బట్టి వీఆర్ఏలనూ వివిధ శాఖలకు బదిలీ చేస్తోంది. వేములవాడ మండలంలో దాదాపు 30 మంది వీఆర్ఏలు తాము ఇష్టప్రకారమే వెళ్లిపోతున్నట్లు, ఎక్కడ విధులు కేటాయించినా పని చేస్తామంటూ అధికారులకు బుధవారం హామీ పత్రం ఇచ్చి, వెళ్లిపోయారు. ఈ సందర్భంగా పలువురు కంటతడి పెట్టారు.

'గృహలక్ష్మి'కి 10,746 దరఖాస్తులు


చందుర్తి మండలం బండపల్లిలో పూరి గుడిసె ముందున్న ఈమె పేరు పల్లెపు రజిత. భర్త రాజేశంతో కలిసి బండలు కొడుతూ జీవిస్తుంది. సొంత ఇల్లు లేని ఈ దంపతులు డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరవుతుందని ఆశలు పెట్టుకున్నారు. కానీ అలా జరగకపోవడంతో అప్పు చేసి, ఒక గుంట భూమి కొనుగోలు చేశారు. అందులో చిన్న గుడిసె వేసుకొని, ఉంటున్నారు. సర్కారు తాజాగా గృహలక్ష్మి పథకం ప్రకటించడంతో ఈసారైనా సొంతింటి కల నెరవేరుతుందేమోనని ఆశగా ఎదురుచూస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇలాంటి వారు వందలాది మంది ఉన్నారు.'

- నేడు చివరి రోజు..
- జిల్లాకు 6,300 ఇళ్లు మంజూరు


కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్ (ఫైల్)

సిరిసిల్ల: 'పూరి గుడిసె లేని సిరిసిల్ల లక్ష్యంగా పేదలందరికీ గృహలక్ష్మి పథకంలో ఇళ్లు మంజూరు చేస్తాం.. ఇంటి జాగా లేకుంటే.. ప్రభుత్వం పట్టా ఇస్తుంది. సొంత జాగా ఉన్న వారికి రూ.3 లక్షలు ఆర్థికసాయం చేస్తుంది. ఈ పార్టీ, ఆ పార్టీ అని చూడకుండా.. ఇల్లు లేని పేదలందరికీ మంజూరు చేసేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలి.. సిరిసిల్లలో ఇంటింటి సర్వే చేస్తే.. 2,800 మంది ఇళ్లు లేని పేదలున్నారని, ఇందులో 2 వేల మందికి డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేశామని, మరో 800 మందికి గృహలక్ష్మి పథకంలో మంజూరు చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖల మంత్రి కేటీఆర్ మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో ప్రకటించారు.' దీంతో ఇల్లు లేని పేదలు తమ సొంతింటి కల నెరవేరుతుందని ఆశపడుతున్నారు.

దరఖాస్తుల వెల్లువ

జిల్లా వ్యాప్తంగా గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. ఈ నెల 5వ తేదీ నుంచి ఇప్పటివరకు 10,746 అర్జీలు వచ్చాయి. గురువారం చివరి రోజు కావడంతో వాటి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

20వ తేదీలోగా క్షేత్రస్థాయి విచారణ

గృహలక్ష్మి పథకం దరఖాస్తులపై ఈ నెల 20వ తేదీలోగా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. అర్హులను గుర్తించి, 25వ తేదీలోగా మంజూరు పత్రాలు ఇవ్వాలని సూచించింది. జిల్లాలోని 13 మండలాలకు, సిరిసిల్ల, వేములవాడ పట్టణాలకు మొత్తం 6,300 గృహలక్ష్మి ఇళ్లు మంజూరయ్యాయి. అర్హులకు ఇంటి నిర్మాణం కోసం రూ.3 లక్షల చొప్పున సాయం అందించనున్నారు.

కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న కేంద్రం


నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, నాయకులు

- అంగన్‌వాడీ టీచర్లు, రెండో ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ

సిరిసిల్లటౌన్: కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ము కాస్తోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ ఆరోపించారు. బుధవారం సిరిసిల్ల అంబేడ్కర్ చౌరస్తాలో వివిధ ట్రేడ్ యూనియన్లు, ప్రభుత్వ స్కీం వర్కర్స్ యూనియన్లతో అంగన్‌వాడీ టీచర్లు, రెండో ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం దొంగచాటున మార్చి, కొత్తగా నల్ల చట్టాలను తెచ్చిందని మండిపడ్డారు. రైతు వ్యతిరేక చట్టాలపై నిరంతర పోరాటం సాగిస్తామన్నారు. వెట్టిచాకిరీకి గురవుతున్న ప్రభుత్వ స్కీం వర్కర్ల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దేశంలోని అన్ని ట్రేడ్ యూనియన్ల పిలుపు మేరకు ఈ నెల 9, 10 తేదీల్లో మహాధర్నా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, నాయకులు గురజాల శ్రీధర్, ఎలిగేటి రాజశేఖర్, చిలుక బాబు, గన్నేరం నర్సయ్య, జువ్వాజి విమల, సూరం పద్మ తదితరులు పాల్గొన్నారు.

మతతత్వ శక్తులపై ఉద్యమిస్తాం

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్


జెండా ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్, నాయకులు

సిరిసిల్లటౌన్: మతతత్వ శక్తులపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరంతరం ఉద్యమిస్తామని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం సిరిసిల్లలోని పార్టీ కార్యాలయంలో క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరించి, మాట్లాడారు. బ్రిటిష్ ప్రభుత్వాన్ని తరిమేందుకు 1942 ఆగస్టు 9న క్విట్ ఇండియా ఉద్యమాన్ని జాతిపిత గాంధీజీ ప్రారంభించారని తెలిపారు. దేశ సమగ్రతను కాపాడటానికి ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టారన్నారు. మతతత్వ శక్తులపై కాంగ్రెస్ కార్యకర్తలు క్విట్ ఇండియా స్ఫూర్తితో పని చేయాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణగౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, మహిళా అధ్యక్షురాలు రమాదేవి, మాజీ కౌన్సిలర్ వెల్ముల స్వరూప, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లను గద్దె దించాలి

వేములవాడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలు విసుగెత్తి పోయారని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లను గద్దె దించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ వార్డు సందర్శనలో భాగంగా బుధవారం వేములవాడ పట్టణంలోని భగవంతరావునగర్‌లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను గెలిపిస్తే రూ.500కే గ్యాస్ సిలిండర్, నిరుద్యోగులకు భృతి, మహిళలు, వృద్ధులు, వితంతువులకు రూ.4,016 పెన్షన్ ఇస్తామన్నారు. రైతులను అన్నివిధాలా ఆదుకునే పార్టీ కాంగ్రెస్సేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సాగారం వెంకటస్వామి, చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, కూరగాయల కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి

కోనరావుపేట: గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా కోనరావుపేట మండలంలోని కమ్మరిపేటతండాలో స్థానిక గిరిజనులతో కలిసి బుధవారం వేడుకలు నిర్వహించారు. 12.49 లక్షల ఎకరాలకు పోడు పట్టాలివ్వకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజనులను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్‌పాషా, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, నాయకులున్నారు.

పద్మశాలీలు రాజకీయాల్లో రాణించాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పద్మశాలీలు ఐక్యంగా ముందుకుసాగి, రాజకీయాల్లో రాణించాలని పద్మశాలీ సంఘం రాష్ట్ర నాయకుడు లగిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయంలో బుధవారం పద్మశాలీ రాజకీయ యుద్ధభేరికి సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. బీసీల్లో అత్యధిక జనాభా కలిగిన పద్మశాలీలకు తగిన గుర్తింపు దక్కడం లేదన్నారు. నరాలను పోగులుగా చేసి వస్త్రాలను తయారు చేస్తున్న నేతన్న జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుంటున్నా హక్కులు మాత్రం పొందలేకపోతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 13న కోరుట్లలో జరిగే పద్మశాలీ రాజకీయ యుద్ధభేరి సభకు పద్మశాలీలు అధిక సంఖ్యలో తరలివచ్చి, విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గాజుల బాలయ్య, నాయకులు గోనె ఎల్లప్ప, ఆంజనేయులు, బొందయ్య తదితరులు పాల్గొన్నారు.

హక్కులకై పోరాడుదాం

రుద్రంగి(వేములవాడ): రాష్ట్రంలో పద్మశాలీలు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలను రూపుమాపేందుకు, పద్మశాలీల హక్కులకై పోరాడుదామని పద్మశాలీ సంఘం రాష్ట్ర సమన్వయకర్త రామ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ నెల 13న కోరుట్లలో జరిగే రాజకీయ యుద్ధభేరికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం రుద్రంగి మండల కేంద్రంలోని పద్మశాలీ సంఘం భవనంలో ఆవిష్కరించారు. జనాభా దామాషా ప్రకారం పద్మశాలీలకు అసెంబ్లీలో 10, కౌన్సిల్‌లో 5, పార్లమెంట్‌లో 3 సీట్లు కేటాయించాలని రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. రాష్ట్ర నాయకులు రుద్ర శ్రీనివాస్, బోగ వెంకటేశ్వర్లు, ఆనందం, శివ భక్త మార్కండేయ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

జిల్లాలో 1,79,571 జాతీయ జెండాల పంపిణీ

సిరిసిల్ల: జిల్లాలో ఇంటింటికీ జాతీయ జెండాలు పంపిణీ చేసేందుకు జిల్లా యంత్రాంగం ప్రణాళిక రూపొందించింది. 1,79,571 ఇళ్లకు త్రివర్ణ పతాకాలు అందించనున్నారు. మండలాలు, మున్సిపాలిటీల వారీగా జెండాల పంపిణీకి ప్రత్యేకంగా రూట్ ఆఫీసర్లను నియమించారు. బోయినపల్లికి 13,530, గంభీరావుపేటకు 14,272, కోనరావుపేటకు 13,377, సిరిసిల్ల మున్సిపాలిటీకి 28,036, వీర్నపల్లికి 4359, వేములవాడ మున్సిపాలిటీకి 10,753, ఎల్లారెడ్డిపేటకు 15,767, చందుర్తికి 10,625, ఇల్లంతకుంటకు 16,624, ముస్తాబాద్‌కు 14,982, రుద్రంగికి 4523, తంగళ్లపల్లికి 16,821, వేములవాడ అర్బన్‌కు 5672, వేములవాడ రూరల్‌కు 10,230 జాతీయ జెండాలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు.